క్లుప్తంగా

మార్కెట్‌కు శ్రావణ శోభ



బాజీ సెంటర్‌లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

విశాఖ విద్య: శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పూజను వేడుకగా జరుపుకునేందుకు మహిళలు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందుకు అవసరమైన పూజా సామగ్రి కొనుగోలు కోసమని మార్కెట్‌ను సందర్శించారు. ఎన్‌ఏడీ కూడలి, బాజీ సెంటర్‌లో పూజా సామగ్రి విక్రయాలు జోరుగా సాగాయి.

జీవీఎంసీ కమిషనర్ దృష్టికి గెడ్డ సమస్య



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పి.గణబాబు కలిశారు. పారిశ్రామిక ప్రాంతంలో గెడ్డల అభివృద్ధికి సంబంధించి ఆయనతో చర్చించారు. గెడ్డల ఆధునికీకరణకు హెచ్‌పీసీఎల్ సంస్థ స్టోమ్ వాటర్ డ్రైయిన్ ప్రాజెక్టును చేపట్టిందని గుర్తుచేశారు. శ్రీహరిపురం వద్ద గెడ్డను ఆధునికీకరించాల్సి ఉందని, గత డీపీఆర్‌ను అమలు చేసి అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ సానుకూలంగా స్పందించి అతి త్వరలో పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటింటి ఓటర్ల పరిశీలనపై సమీక్ష



సమీక్షిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీవో) హుస్సేన్ సాహెబ్ గురువారం జీవీఎంసీ జోన్–5 పరిధి పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఎల్‌వో యాప్‌లో ఇంటింటి ఓటర్ల పరిశీలన, నమోదు, ఫారమ్స్ డిజిటలైజేషన్ వంటి అంశాలపై ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, జోన్–8 కమిషనర్ మల్లయ్యనాయుడు, గోపాలపట్నం తహసీల్దార్, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.

బైక్ చోరీ

మర్రిపాలెం: ద్విచక్ర వాహనం చోరీ అయిందని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్–4లో నివసిస్తున్న ప్రతాప్‌కుమార్ ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటిముందు బైకు పార్క్‌చేశాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి అది కనిపించలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో ఎస్‌ఐ సునీల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాహిని సీతారామ్ శత జయంతి

సీతంపేట: విశాఖ సిటీ శిష్టకరణ సంఘం వ్యవస్థాపకుడు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సాహిని సీతారామ్ శత జయంతి వేడుకలు అబిద్‌నగర్‌లోని సౌభాగ్య సదన్‌లో గురువారం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది సాహిని రమేష్ ఆధ్వర్యంలో సీతారామ్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. సీతారామ్ కుమారుడు సాహిని సత్యానంద్ దంపతులను సత్కరించారు.

కృష్ణా ముకుందా మురారీ

- కనుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- అలరించిన చిన్నికృష్ణులు, గోపికలు



గోకులకృష్ణ పార్కులో చిన్నికృష్ణులు, గోపికల సందడి



గొల్ల వీధిలో శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్ తదితరులు



మల్కాపురం పల్లి వీధిలో చిన్నికృష్ణుడు



భాష్యం స్కూల్‌లో ఉట్టి వద్ద చిన్నికృష్ణులు, గోపికల కోలాహలం



ములగాడ హౌసింగ్ కాలనీలో ఉట్టి కొడుతున్న చిన్నికృష్ణుడు

మల్కాపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం కనుల పండువగా నిర్వహించారు. మల్కాపురం గొల్ల వీధిలో శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి పంచామృతాభిషేకాలు చేశారు. తులసి, సుగంధ మాలలతో స్వామిని అలంకరించి విశేష పూజలు జరిపారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, పుర్రె సురేష్ యాదవ్ తదితరులు శ్రీకష్ణుడిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో నాయకులు పిలకా రామ్మోహన్‌రెడ్డి, భోగవల్లి నాగభూషణం, బూస అప్పలరెడ్డి, చట్టి నూకరాజు, ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

- వెంకన్నపాలెం, ప్రకాష్‌నగర్, నక్కవానిపాలెం, పాత చెక్‌పోస్ట్ ఏరియాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.
- మల్కాపురం, శ్రీహరిపురం, వెంకన్నపాలెం తదితర ప్రాంతాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పి.గణబాబు, ట్రేడ్ యూనియన్ నాయకుడు నక్క లక్ష్మణరావు యాదవ్ పాల్గొన్నారు.
- మేయర్ గొలగాని హరివెంకటకుమారి, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందూ యాదవ్, మాజీ కార్పొరేటర్ ఉరుకూటి అప్పారావు తదితరులు పలు ఆలయాల్లో జరిగిన పూజల్లో పాల్గొని శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు.

చిన్నికృష్ణుల సందడి

పారిశ్రామిక ప్రాంతంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు సందడి చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా అలంకరించి స్థానిక ఆలయాలకు తీసుకువెళ్లి పూజలు చేయించారు. మల్కాపురం పల్లి వీధిలో చిన్నారి అర్జున్ కృష్ణ.. బాల కృష్ణుడి అలంకరణలో అందరినీ ఆకట్టుకున్నాడు. ములగాడ హౌసింగ్ కాలనీలో చిన్నికృష్ణులతో ఉట్టి కొట్టించారు. స్థానిక గోకుల పార్కులోని శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద చిన్నారి వేషధారులు ఆడిపాడారు. శ్రీహరిపురం భాష్యం స్కూల్‌లో విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణల్లో అలరించారు.

వేణుగోపాలుడిని దర్శించుకున్న ఆడారి

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు పాత గోపాలపట్నం వేణుగోపాల స్వామిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దర్శించుకుని విశేష పూజలు చేశారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- ఎన్‌ఏడీ శ్రీచైతన్య స్కూల్‌లో చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయాల్లో పూజలు

గోపాలపట్నం ప్రాంతాల్లోని వేణుగోపాల స్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. 92వ వార్డు పాత గోపాలపట్నం, నందమూరినగర్ వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

- పాతగోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెంలోని లక్ష్మీగణపతి సమేత శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ వేడుకలు ప్రారంభించారు. ముందుగా ఆలయ ప్రధాన అర్చకుడు ఆంజనేయ శర్మ నేతృత్వంలో ఆనంద్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుడికి భక్తులు క్షీరాభిషేకాలు జరిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధ్యక్షుడు జి.వి.భాస్కర్, కార్యదర్శి డొప్ప జగన్, కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. శుక్రవారం ఉట్టి సంబరం, శనివారం తిరువీధి మహోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 52, 56, 57 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, ఏపీఐడీసీ డైరెక్టర్ కాయిత పైడి వెంకటలక్ష్మి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకీ శ్యామ్‌కుమార్ రెడ్డి, సర్వసిద్ధి సాయిలత, కాయిత రత్నాకర్, కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సీఐ ఎస్.సాయి, ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, యలమంచిలి వెంకటరావు, సచివాలయాల కన్వీనర్లు, శశికుమార్, రాజ్యం, రమణ, రాజు, సిహెచ్.శ్రీను, స్వర్ణలత, నమ్మి లీలావతి పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డులోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. పలు కాలనీల్లో చిన్నికృష్ణులు, గోపికల వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. స్థానిక నాయకుడు నక్కా సూర్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



56వ వార్డులో కృష్ణాష్టమి పూజల్లో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్, నాయకులు



62వ వార్డు ప్రకాశ్‌నగర్‌లో శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మణరావు



పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి చందు, అప్పారావు యాదవ్



పాతగోపాలపట్నం వేణుగోపాల స్వామి సన్నిధిలో ఆడారి ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు



శ్రీచైతన్య స్కూల్‌లో చిన్నికృష్ణులు, గోపికల సందడి

బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యను పరిశీలిస్తున్న ఏడీసీపీ రాజీవ్‌కుమార్, సీఐ అశోక్‌కుమార్

గోపాలపట్నం: బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ కూడలిలో ఒక వైపు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక్కడి పరిస్థితిని గురువారం ట్రాఫిక్ ఏడీసీపీ జె.రాజీవ్‌కుమార్, సీఐ అశోక్‌కుమార్‌లు పర్యవేక్షించారు. ఒక వైపు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో నాలుగు రోడ్ల జంక్షన్‌లో సుసర్ల కాలనీ, పాతగోపాలపట్నం నుంచి వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరు గోపాలపట్నం శ్మశానవాటిక వద్ద ఉన్న కూడలిలో యూటర్న్ చేసుకుని ఎన్ఏడీ వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సుసర్ల కాలనీ నుంచి గోపాలపట్నం వెళ్లే వారు లక్ష్మీనగర్ మీదుగా వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. వాహన చోదకులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బారికేడ్లు తొలగించాలి: సీపీఎం

బాజీ జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బలివాడ వెంకటరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ట్రాఫిక్ నిబంధనల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టడం సరి కాదన్నారు.

గోపాలపట్నం హైస్కూల్‌లో కంటి వైద్య శిబిరం

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎల్ అండ్ టీ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ జీఎం అతుల్ శ్రీవత్సవ, ఏజీఎం చందర్‌మాన్‌జి ప్రారంభించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో జరిగిన ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తామని ఎల్ అండ్ టీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్తేర్ హెప్సిబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థ జీఎం, ఏజీఎంలు

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసీదళార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేకం సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక కుంకుమ పూజలు..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మీ పూజలు గురువారం నాటికి 22వ రోజుకు చేరాయి. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కుంకుమ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



సహస్ర తులసీదళార్చనలో సిరులతల్లి

నేడు ఉచిత శ్రావణలక్ష్మి పూజలు..

ఆలయంలో శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. ఉదయం 6.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు కలశం కోసం చెంబు, ఆచమనం కోసం గ్లాసు తెచ్చుకోవాలని ఈవో కె.శిరీష తెలిపారు.

మారయ్యకు జియ్యాని పరామర్శ



మారయ్యను పరామర్శిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సాలాపు మారయ్యను ఆయన ఇంటి వద్ద గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరామర్శించారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. పార్టీ నాయకులు అండగా ఉంటారని, ఏ అవసరమున్నా తనను సంప్రదించాలని జియ్యాని భరోసా ఇచ్చారు. సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొవాలని ఆకాంక్షించారు. పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



దాసరి అనూష

మర్రిపాలెం: బాలిక అదృశ్యంపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దుర్గానగర్‌లో తల్లిదండ్రులతో నివసిస్తున్న దాసరి అనూష(17) ఈ నెల 5వ తేదీ సాయంత్రం తన స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి సత్య ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలభైరవుడికి అభిషేకం

సీతమ్మధార: అష్టమి సందర్భంగా గురువారం నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో కొలువైన కాలభైరవ స్వామికి అర్చకుడు రాజా స్వామి అభిషేకం, విశేషపూజలు చేశారు. భక్తులు గుమ్మడి కాయలో నెయ్యి దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.

వలంటీర్ నిబద్ధత

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



మంచంపై ఉన్న వృద్ధుడికి పింఛన్ సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ సొమ్ము ఇస్తున్న వలంటీర్ వెంకటలక్ష్మి

మల్కాపురం: గర్భంతో ఉన్నా.. తన విధులకు గౌరవమిచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగి వద్దకు వెళ్లి పింఛన్ అందజేసింది యారాడకు చెందిన వలంటీర్ భోగవల్లి వెంకటలక్ష్మి. పనిలో ఆమె నిబద్ధతకు అందరూ అభినందించారు. 8 నెలల గర్భిణి వలంటీర్ వెంకటలక్ష్మి తన పరిధిలోని బంక అయ్యమ్మ అనే వ్యక్తి ఆరోగ్యం బాగోలేక కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకుని గురువారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందించింది.

‘ఆడారి’ సొంత నిధులతో ముగ్గురికి..

రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మానవత్వం చూపారు. 60వ వార్డు ఇందిరా కాలనీలో మంచంపై ఉన్న ముగ్గురు వృద్ధులు ముసలమ్మ, నాయుడు, సోంబాబుకు సాంకేతిక కారణాల వల్ల పింఛన్ రావడం లేదని ఆయన తెలుసుకుని తన సొంత నిధులు అందిస్తున్నారు. పింఛన్ సొమ్ము మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు జీవీఎల్ నరేష్, సత్తిబాబు గురువారం ఆ వృద్ధులకు అందించారు.

ఉత్సాహంగా స్టూడెంట్ కౌన్సిల్ ఉత్సవాలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గురువారం 66వ స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. కొత్త విద్యా సంవత్సరంలో చేరిన ఇంటర్, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థినులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వైవీ అనురాధ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారత పొందినట్లన్నారు. కళాశాలతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ రాధాకృష్ణను సత్కరించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మిస్ ఫ్రెషర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డిగ్రీ విభాగంలో సాయి, పావని, మానస, ఇంటర్ విభాగంలో ఈశా, సూర్యవినయ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, జయలక్ష్మి, మేరీ విజయరత్న, అధ్యాపకులు, కౌన్సిల్ సలహాదారులు పాల్గొన్నారు.



నృత్యంతో అలరిస్తున్న విద్యార్థినులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

మర్రిపాలెం: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన హనుమంతరావు అనే వృద్ధుడు తన కుమారుడు రాజాబాబుతో కలిసి కంచరపాలెం ధర్మానగర్‌లో నివసిస్తున్న మరో కుమారుడు వరప్రసాద్ ఇంటికి వచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ధర్మానగర్ వద్ద రోడ్డు దాటుతుండగా.. గుర్తు తెలియని కారు అతడిని ఢీకొట్టడంతో తలకు గాయాలు కాగా.. కేజీహెచ్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. రాజాబాబు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామం, యోగా, ధ్యానంతో ఆరోగ్యం

తాటిచెట్లపాలెం: ఆరోగ్యకరమైన అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటితో ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండవచ్చని డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. రైల్వే ఉద్యోగులు, సిబ్బంది కోసం వాల్తేర్ డివిజన్ ప్రేరణ పేరుతో గురువారం దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే మానసిక ప్రశాంతత, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని ఉద్యోగులకు సూచించారు. హెల్త్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్ టెక్నిక్స్‌ను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రేరణాత్మకమైన కేస్‌స్టడీల ద్వారా పలు విషయాలు వెల్లడించారు. అనంతరం రైల్వే ఉద్యోగులు అడిగిన ప్రశ్నలకు సూర్యారావు సమాధానమిచ్చారు. ఈ సమావేశాల ద్వారా సిబ్బందిలో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం కలిగిస్తూ, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తెలిపారు. ఏడీఆర్‌ఎంలు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

పర్యావరణ హితంగా జీవిద్దాం

సీతంపేట: సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని ఎకో ఇండియా అధినేత దీపా రఘా పిలుపునిచ్చారు. ఎకో ఇండియా, నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పర్యావరణంపై రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆర్‌జేడీ జ్యోతికుమారి, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ హితంగా ఎలా జీవించాలన్న విషయాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాలన్నారు. దాని కోసం పాఠశాలలో నిర్వహించవలసిన కార్యక్రమాలు, వాటిని అమలు చేయవలసిన విధానాల గురించి ఉపాధ్యాయులకు వివరించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ పర్యావరణానికి అనుకూలమైన జీవన పద్ధతులు అవలంభించి జీవ వైవిధ్యాన్ని సంరక్షించాలన్నారు. ఈ సందర్భంగా పలు రకాల సేంద్రియ ఉత్పత్తులు, ఔషధ మొక్కలను, పర్యావరణ సంరక్షణ మీద మన్యం జిల్లా కో ఆర్డినేటర్ జి.రాజు గీసిన వివిధ పెయింటింగ్స్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ పి.నీలకంఠ, గ్రీన్‌క్లైమేట్ వ్యవస్థాపకులు జె.వి.రత్నం, విశాఖ జిల్లా ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ ఎస్.బాబూరావు, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.